

'ఆదిత్య'కు స్వయంప్రతిపత్తి

ప్రజాశక్తి-మదనపల్లి

మదనపల్లి సమీపంలోని పుంగనూరు రోడ్డులో ఉన్న ఆదిత్య ఇంజినీరింగ్ కళాశాలకు ప్రతిష్టాత్మక అటానమస్(స్వయం ప్రతిపత్తి) యుజిసి న్యూఢిల్లీ ద్వారా హోదా లభించినట్లు కళాశాల ఛైర్మన్ ఆర్.రామ్మోహన్‌రెడ్డి, అధ్యక్షులు నాగ మల్లారెడ్డి, డైరెక్టర్ డాక్టర్ ఎస్.రామలింగారెడ్డి, కళాశాల ప్రిన్సిపల్ డాక్టర్ కె.సతీష్ బాబులు పేర్కొన్నారు. సోమవారం కళాశాలలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో వారు మాట్లాడుతూ పదేళ్లపాటు ఈ హోదా ఉంటుందన్నారు. దీనివల్ల కళాశాల విద్యార్థులకు ఉపాధి, ఉద్యోగ అవకాశాలు మెరుగుపడతాయని పేర్కొన్నారు. మరింత నాణ్యమైన విద్య అందుబాటులోకి వస్తుందని చెప్పారు. అటానమస్ ద్వారా సాంకేతిక మార్పులకు అనుగుణంగా పాఠ్యాంశాలు కోర్సులు మార్చుకునే అవకాశం ఉంటుందని తెలిపారు. విద్యార్థుల వ్యక్తిగత అభివృద్ధిపై దృష్టి సారించడంతోపాటు పారిశ్రామిక శిక్షణ ఇచ్చేందుకు ఈ గుర్తింపు ఎంతగానో దోహదపడుతుందని పేర్కొన్నారు. కళాశాల సిబ్బంది, పూర్వ విద్యార్థులు, వారి తల్లిదండ్రులు సమిష్టి కృషి వల్ల ఈ హోదా లభించిందని ఈ సందర్భంగా వారు పేర్కొన్నారు.



వికలాంగ పింఛన్లపై పిడుగు!

ఉమ్మడి జిల్లాలో 3,513 మందిపై విచారణ
నేడు అన్నమయ్య జిల్లాలో రీ అసెస్మెంట్ పరీక్ష
వైఎస్ఆర్ జిల్లా వ్యాప్తంగా పలువురికి నోటీసులు

జిల్లాలోని వికలాంగ (దివ్యాంగుల) పింఛనుదారులపై కత్తెరింపు పిడుగు పడనుంది. 2024 సార్వత్రిక ఎన్నికల ముంగిట వికలాంగ పింఛన్లలో నకిలీలు ఉన్నాయనే ఆరోపణల నేపథ్యంలో కలెక్టర్లు విచారణకు ఆదేశించారు. వైఎస్ఆర్, అన్నమయ్య జిల్లా అధికార యంత్రాంగం 3,513 మంది వికలాంగ పింఛనుదారులను విచారించనుంది. పలువురు పింఛనుదారులకు నోటీసులను సైతం జారీ చేసింది. ఉలుకూ పలుకూ లేకుండా ఉన్నఫళంగా వికలాంగ పింఛనుదారులకు నోటీసులు జారీ చేయడంతో అయోమయం నెలకొంది.

ప్రజాశక్తి - కడప ప్రతినిధి

కడప జిల్లాలో 2,66,385 మంది ఫింఛనుదారులు ఉన్నారు. వీరికి ప్రతి నెలా సుమారు రూ.120 కోట్ల మేర చెల్లింపులు చేస్తోంది. వీరిలో 39,839 మంది వికలాంగ పింఛనుదారులు ఉన్నారు. జిల్లాలోని సామాజిక పింఛన్ల కేటగిరీలో ఒఎపి పింఛనుదారుల అనంతరం వికలాంగ పింఛనుదారులే అధికంగా ఉండడం గమనార్హం. సార్వత్రిక ఎన్నికల ముంగిట వికలాంగ పింఛన్లలో నకిలీ పింఛన్లు ఉన్నాయనే ఫిర్యాదులు రావడంతో కలెక్టర్లు విచారణకు ఆదేశించారు. వైఎస్ఆర్ జిల్లాలో 3,500 పెన్షనుదారులను నకిలీగా భావించింది. నోటీసులు సైతం జారీ చేసింది. సింహాద్రిపురం మండలంలోనే 44 మందికి నోటీసులు జారీ చేసింది. అన్నమయ్య జిల్లాలో 2,23,436 మంది పెన్షనుదారులు ఉన్నారు. వీరికి సుమారు రూ.110 కోట్ల మేరకు చెల్లింపులు చేయాల్సి వస్తోంది. వీరిలో 26,849 మంది వికలాంగ పింఛనుదారులు ఉన్నారు. 1040 మంది బెడెడ్ వికలాంగులు ఉండడం గమనార్హం. రామాపురం మండలానికి చెందిన 13 మంది వికలాంగ పింఛనుదారులపై విచారణకు ఆదేశించింది. వెరసి ఉభయ జిల్లాలో 3,513 మంది వికలాంగ పింఛనుదారులపై విచారణ చేపట్టనున్నారు. అన్నమయ్య జిల్లా యంత్రాంగం మదనపల్లికి చెందిన వైదులతో 13 పింఛనుదారులకు రీఅసెస్మెంట్ పరీక్ష నిర్వహణకు ఏర్పాట్లు చేశారు. ప్రభుత్వం వికలాంగత్వం తీవ్రత ఆధారంగా రూ.ఆరు వేల మేరకు పింఛను చెల్లింపులు చేస్తోంది. పెరాలసిస్ వంటి మంచానికి పరిమితమైన రోగులకు రూ.15 వేల వరకు చెల్లిస్తోంది. ఇటువంటి తీవ్ర వైకల్యం కలిగిన వికలాంగ పింఛనుదారులపై విచారణ చేపట్టడం సర్వత్రా విస్మయం వ్యక్తమవుతోంది.

కదంతొక్కిన ప్రకృతి వ్యవసాయ ఉద్యోగులు

- 15 నెలల జీతం చెల్లించాలంటూ కలెక్టరేట్ ఎదుట నిరసన, బైఠాయింపు
- భారీగా తరలివచ్చిన ప్రకృతి వ్యవసాయ ఉద్యోగులు
- జీతాలు ఇచ్చేవరకూ పోరాటాలు కొనసాగిస్తాం : సిఐటియు



కలెక్టరేట్ వద్ద బైఠాయించిన ప్రకృతి వ్యవసాయ ఉద్యోగులు

ప్రజాశక్తి-రాయచోటి టౌన్

ప్రకృతి వ్యవసాయ ఉద్యోగులు 15 నెలల జీతం కోసం కలెక్టరెట్ వద్ద కదంతొక్కరు. జీతాలు ఇచ్చే వరకూ పోరాటాలు కొనసాగిస్తామని సోమవారం సిఐటియు రాష్ట్ర కమిటీ పిలుపు మేరకు ప్రకృతి వ్యవసాయంలో పనిచేస్తున్న అన్నమయ్య జిల్లా 450 మంది ఉద్యోగులు సిఐటియు ఆధ్వర్యంలో డిఎంహెచ్ఒ కార్యాలయం నుంచి కలెక్టరేట్ వరకు భారీ ర్యాలీ నిర్వహించి కలెక్టరేట్ ఎదుట భారీ మానవహారంతో పెండింగ్ వేతనాల కోసం నిరసన వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా సిఐటియు జిల్లా ప్రధాన కార్యదర్శి ఎ.రామాంజులు మాట్లాడుతూ గౌరవేతనం లేక తమ కుటుంబాల పోషణ పిల్లల చదువులు, ఆరోగ్యం, కుటుంబ అవసరాలకు చాలా ఇబ్బందులు పడుతున్నామని ఆవేదన వ్యక్తం చేశారు. జిల్లా అధికారులు రాష్ట్ర అధికారుల దృష్టికి పలు దఫాలుగా సమస్యలు విన్నవించినప్పటికీ గౌరవ వేతనాలు వేయబోతున్నామని, అధైర్య పడవద్దని పదేపదే హామీ ఇస్తూ కాలయాపన చేస్తూ 15 నెలల గౌరవ వేతనాలు ఎపిసిఎన్ఎఫ్ ప్రాజెక్టు జీతాలు ఇవ్వకుండా కాలయాపన చేస్తున్నారని తెలిపారు. ప్రకృతి వ్యవసాయ ఉద్యోగుల సంఘం జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు మధుకర్, సిద్దయ్య మాట్లాడుతూ పెద్ద ఎత్తున ధర్నాలు చేసిన ఫలితంగా కేవలం రెండు నెలలు మాత్రమే జీతాలు ఇచ్చి చేతులు దులుపుకున్నరన్నారు. ఒక్కొక్కరికి రూ.5 నుంచి రూ.7 లక్షలు రావాల్సి ఉందని తెలిపారు. కుటుంబ పోషణ కోసం చేసిన రుణాలకు వడ్డీ కట్టలేక ఇబ్బందులు పడుతున్నామని ఆవేదన వ్యక్తం చేశారు. ఇప్పటికైనా 15 నెలల బకాయి వేతనాలు ఇచ్చి ఆదుకోవాలని కోరారు. పిల్లల చదువులకు ఇంటి అద్దెలతో పాటు చేసిన అప్పుకు వడ్డీ చెల్లించలేక ఇక్కట్లకు గురవుతున్నట్టు తెలిపారు. పెండింగ్ జీతాల కొరకు దశల వారి ఉద్యమాలు చేస్తామని హెచ్చరించారు. అనంతరం జాయింట్ కలెక్టరేట్ ఫర్మాన అహ్మద్‌ఖాన్‌కు వినతి పత్రం అందించారు. పెండింగ్ జీతాల విడుదలకు అధికార యంత్రాంగంతో మాట్లాడి పరిష్కారం కొరకు కృషి చేస్తామని ప్రకృతి వ్యవసాయ ఉద్యోగులకు ఆయన హామీ ఇచ్చారు. కార్యక్రమంలో జిల్లా కమిటీ సభ్యులు రవీంద్ర, రామయ్య, వంశీ, ధనశేఖర్, ఖాదర్బీ పద్మజ, ఎస్.వినాగరాజు, రమణ, రామాంజులు, కృష్ణయ్య, వెంకటరామిరెడ్డి, రైతు సంఘం జిల్లా ఉపాధ్యక్షుడు కె.నాగబసిరెడ్డి, ప్రకృతి ఉద్యోగులు పాల్గొన్నారు.

నిబంధనలు పాటించని విద్యా సంస్థలపై చర్యలు తీసుకోవాలి

- నిరసనలో ఎస్ఎఫ్ఐ జిల్లా కార్యదర్శి నరసింహ



కలెక్టరేట్ ఎదుట నిరసన చేస్తున్న ఎస్ఎఫ్ఐ నాయకులు, కార్యకర్తలు

ప్రజాశక్తి - రాయచోటి టౌన్

ప్రభుత్వ నిబంధనలను ఉల్లంఘిస్తూ విద్యార్థుల జీవితాలతో చెలగాటమాడుతున్న కార్పొరేట్, ప్రవేట్ విద్యా సంస్థలపై చర్యలు తీసుకోవాలని ఎస్ఎఫ్ఐ జిల్లా కార్యదర్శి నరసింహ, ఉపాధ్యక్షులు రమణ డిమాండ్ చేశారు. సోమవారం జిల్లా కలెక్టరేట్ కార్యాలయం ఎదురుగా ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ జిల్లాలో అనేక ప్రయివేటు పాఠశాలలు అనుమతులు లేకుండా నడుస్తున్నాయని చెప్పారు. పలుమార్లు దృష్టికి తీసుకెళ్లినా చర్యలు తీసుకోవడం లేదని అన్నారు. నందలూరులోని విభ ఇంటర్నేషనల్ స్కూల్, అద్వైత గురుకుల పాఠశాలకు అనుమతులు లేనప్పటికీ నడుపుతున్నాయని, విద్యార్థుల హాజరు శాతాన్ని నమోదు కూడా చేయడం లేదని పేర్కొన్నారు. రాష్ట్ర ప్రభుత్వం తల్లికి వందనం నగదుకు 75 శాతం హాజరు ఉండాలన్న నిబంధనలను వారు ఉల్లంఘిస్తున్నారని అన్నారు. అలాగే గాలివీడు మండలంలోని అద్వైత గురుకుల పాఠశాల నిర్మాణ దశలో ఉన్నా కూడా విద్యార్థులకు అదే తరగతి గదిలో చదువుతున్నారు అని అన్నారు. ముందస్తు అక్రమ అడ్మిషన్లను చేసి తరగతులను నిర్వహిస్తున్న పాఠశాల యజమానంపై క్రిమినల్ కేసు నమోదు చేయాలని, ప్రయివేట్, కార్పొరేట్ పాఠశాలలకు సహకరిస్తున్న అధికారులపై విచారించి న్యాయమైన చర్యలు చేపట్టాలని డిమాండ్ చేశారు. కొన్ని ప్రయివేట్ పాఠశాలలు ఏడో తరగతి వరకు అనుమతి ఉంటే పదో తరగతి వరకు పాఠాలు చెబుతున్నారని మండిపడ్డారు. ప్రయివేట్ పాఠశాలలో పాఠ్యపుస్తకాలు, యూనిఫామ్, షూ, బెల్ట్ అమ్మకాలను నియంత్రించడంలో మండల విద్యాశాఖ అధికారులు విఫలమయ్యారని అన్నారు. తల్లిదండ్రులకు ఫీజు గురించి తెలిసేలా నోటీస్ బోర్డును ఏర్పాటు చేసి ఫీజు నియంత్రణ చట్టాన్ని పటిష్ఠంగా అమలు చేయాలన్నారు. విద్యార్థులకు కావాల్సిన కనీస వసతులు లేని పాఠశాలను అనుమతి రద్దు చేయాలన్నారు. దీనిపై తక్షణం స్పందించి చర్యలు తీసుకొని పక్షంలో దశలవారీగా ఎస్ఎఫ్ఐ ఆధ్వర్యంలో నిరాహార దీక్షలు చేస్తామని అన్నారు. అనంతరం డిమాండ్లతో కూడిన వినతి పత్రాన్ని జిల్లా అదనపు కలెక్టర్ వర్మ అహ్మద్ ఖాన్‌కు వినతి పత్రాన్ని అందించారు. కార్యక్రమంలో ఎస్ఎఫ్ఐ జిల్లా సహాయ కార్యదర్శి చందు, జిల్లా కమిటీ సభ్యులు చెంగయ్య, నరేష్, నాగార్జున, మదన్, జయాత్, భాను ప్రసాద్, శ్రీనాథ్, గోపాల్, నరేష్ బాబు, వెంకటేష్, బాలకృష్ణ పాల్గొన్నారు.

జిల్లాను కుష్టు రహితంగా మార్చాలి : జెసి



కుష్టు వ్యాధి ప్రచార పోస్టులను ఆవిష్కరిస్తున్న జెసి

ప్రజాశక్తి- రాయచోటి

జిల్లాను కుష్టు వ్యాధి రహితంగా రూపొందించాలని జాయింట్ కలెక్టర్ పర్మాన్ అహ్మద్‌ఖాన్ వైద్యాధికారులను ఆదేశించారు. సోమవారం కలెక్టరేట్‌లోని సమావేశ హాలులో జెసి అధ్యక్షతన కుష్టి వ్యాధిగ్రస్తులను గుర్తించే జిల్లా స్థాయి సమన్వయ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా జాయింట్ కలెక్టర్ మాట్లాడుతూ జాతీయ కుష్టు వ్యాధి నిర్మూలన కార్యక్రమం అమలులో భాగంగా రాష్ట్ర ప్రభుత్వ ఆదేశాల మేరకు జిల్లాలో ఈనెల 18 నుంచి ఆగస్టు 2 వరకు కుష్టి వ్యాధి.గ్రస్తులను గుర్తించే కార్యక్రమం ప్రాథమిక ఆరోగ్య కేంద్రం సిబ్బంది ఇంటింటి సర్వే నిర్వహిస్తారన్నారు. ఇందులో భాగంగా కుష్టు వ్యాధి అనుమానిత లక్షణాలు ఉన్న ఎడల ఇంటి వద్దకు ఆరోగ్య కార్యకర్తలు పరీక్ష చేయడానికి వచ్చినప్పుడు తప్పనిసరిగా చూపించుకోవాలని ప్రజలకు పిలుపునిచ్చారు. ప్రతి ప్రాథమిక ఆరోగ్య కేంద్రం, లేదా ఆరోగ్య కార్యకర్త వద్ద ఎమ్‌డిటి మందులు ఉచితంగా లభిస్తాయన్నారు. కుష్టు వ్యాధిగ్రస్తుల గుర్తింపును పటిష్టంగా నిర్వహించాలన్నారు. సమావేశంలో డిఎంహెచ్ఒ డాక్టర్ కె. కొండయ్య మాట్లాడుతూ అన్నమయ్య జిల్లాలో కుష్టు వ్యాధిగ్రస్తులను గుర్తించే కార్యక్రమంలో భాగంగా మొత్తం 1237 టీములు ఇంటింటి సర్వే నిర్వహిస్తూ ప్రతి ఒక్కరిని వ్యాధి లక్షణాలు పరిశీలిస్తారన్నారు. ఈ సర్వే పరిశీలించడానికి 502 మంది సూపర్‌వైజర్లను నియమించారన్నారు. అదనపు జిల్లా వైద్య ఆరోగ్యశాఖ అధికారి డాక్టర్ శైలజ మాట్లాడుతూ ఈ సర్వేలో అనుమానంగా ఉన్న వారిని గుర్తించి వైద్యాధికారులు పరిశీలించి వ్యాధి నిర్ధారణ అయితే వెంటనే మల్టీ డ్రగ్ థెరపీ మందులు వెంటనే అందజేస్తారన్నారు. కుష్టు వ్యాధికి సంబంధించిన మందులు ప్రతి ఆరోగ్య కేంద్రంలో ఉచితంగా లభిస్తాయన్నారు. వ్యాధి లక్షణాలను గుర్తించేందుకు ఆరోగ్య సిబ్బందికి టీములకు సర్వేలో ప్రజలందరూ సహకరించాలని వారు కోరారు. ప్రాథమిక దశలోనే ఈ వ్యాధి లక్షణాలను గుర్తించి చికిత్స ఇప్పించగలిగితే అంగవైకల్యం నివారించవచ్చునన్నారు. అనంతరం కుష్టు వ్యాధి ప్రచార పోస్టర్లను, పాంప్లెట్లను జాయింట్ కలెక్టర్ ఆవిష్కరించారు. కుష్టు వ్యాధి నిర్మూలనకు తీసుకోవాల్సిన జాగ్రత్తలు, చికిత్సలపై ప్రజలలో విస్తృతంగా అవగాహన కల్పించాలని జెసి పేర్కొన్నారు. కార్యక్రమంలో డిఆర్ఒ సత్యనారాయణరావు, డిస్ట్రిక్ట్ న్యూక్లియస్ మెడికల్ ఆఫీసర్ డాక్టర్ విష్ణువర్ధన్‌రెడ్డి, పారామెడికల్ అధికారి రవికుమార్, డిప్యూటీ పారామెడికల్ అధికారులు శంభు ప్రసాద్ వేణుగోపాల్, అన్ని శాఖల అధికారులు పాల్గొన్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న గోసాల దేవి

దాడి చేసిన వారిని కఠినంగా శిక్షించాలి

ప్రజాశక్తి-రైల్వేకోడూరు

కులం పేరుతో దూషించిన వారిని కఠినంగా శిక్షించాలని నియోజకవర్గ కాంగ్రెస్ పార్టీ ఇన్‌ఛార్జి గోసాల దేవి, కాంగ్రెస్ పార్టీ రాష్ట్ర సీనియర్ నాయకులు ఎన్.శాంతయ్య అన్నారు. సోమవారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో వారు మాట్లాడుతూ ప్రజాస్వామ్యంలో ఇటువంటి దాడిలు సరైనది కాదని రాజ్యాంగం వచ్చి 75 సంవత్సరాలైనను ఇంకనూ దళితులపైన దాడులు జరుగుతూనే ఉన్నాయని పేర్కొన్నారు. ఒంటిమిట్ట మండలం పెన్నా పేరూరు గ్రామం ఎస్‌సి కులానికి చెందిన కదిరి ప్రభాకర్ అనే వ్యక్తిపై పెత్తందారుడి ఇంటి అరుగుపైన కూర్చున్నాడని కుల దుహంకారంతో వేడి నూనె పోసిన వ్యక్తిని వెంటనే అరెస్టు చేసి కఠినంగా శిక్షించాలని డిమాండ్ చేశారు. ఎస్సీల రక్షణ కొరకు ఎన్ని చట్టాలు తెచ్చినా కూడా ఇంకా దళితుల పైన దాడులు జరుగుతూనే ఉన్నాయి అరుగుపైన కూర్చున్నాడని అతడిని కులం పేరుతో దూషించి వేడి నూనె పోయడం చాలా దుర్మార్గమని వెంటనే అరెస్టు చేసి ఎస్సీ, ఎస్టీ అట్రాసిటీ కేసు నమోదు చేయాలని డిమాండ్ చేశారు. లేని పక్షాన ప్రజాసంఘాలు దళిత నాయకులతో కలిసి ఒంటిమిట్ట సిఐ ఆఫీసు ఎదురుట ధర్నా చేపడతామని హెచ్చరించారు. కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ పుల్లంపేట మండల నాయకులు సిగమాల రమేష్ పుల్లంపేట మహిళా నాయకులు సలోమి పాల్గొన్నారు.

హంస వాహనంపై సౌమ్యనాథుడు

ప్రజాశక్తి-నందలూరు

శ్రీ సౌమ్యనాథ స్వామి బ్రహ్మోత్సవాల్లో భాగంగా మూడవ రోజు సోమవారం ఉదయం పల్లకి సేవ కార్యక్రమాన్ని ఆలయ అర్చకులు సునీల్ కుమార్ శర్మ బృందం ఆధ్వర్యంలో మాడ వీధుల్లో మహిళల కోలాటాల మధ్య ఊరేగుతూ భక్తులకు దర్శనమిచ్చారు. సాయంత్రం ఊంజల సేవా కార్యక్రమాన్ని నిర్వహించారు. రాత్రి హంస వాహనంపై సరస్వతి దేవి అలంకారంలో శ్రీ సౌమ్యనాథుడు శ్రీదేవి భూదేవితో కలిసి విశేషాలంకరణలో మాడ వీధులలో ఊరేగుతూ భక్తులకు దర్శనమిచ్చారు. భక్తులు స్వామి వారికి కాయ కర్పూరం సమర్పించారు.



హంసవాహనంపై సౌమ్యనాథుడు

బ్రహ్మోత్సవాలలో నేడు

ఉత్సవాలలో భాగంగా నాల్గవ రోజు మంగళవారం ఉదయం పల్లకిసేవ, గ్రామోత్సవం, తిరుమంజనం. రాత్రికి సింహ వాహనంపై సౌమ్యనాథ స్వామి గ్రామోత్సవం నిర్వహించనున్నట్లు ఆలయ ఇన్స్పెక్టర్ దిలీప్ కుమార్ తెలిపారు.

కంప్యూటర్ సర్టిఫికెట్లు పంపిణీ

ప్రజాశక్తి - రాయచోటి

ప్రపంచ యువ నైపుణ్య దినోత్సవ సందర్భంగా పట్టణంలో శివసాయి టెక్నాలజీస్ (కంప్యూటర్ శిక్షణా కేంద్రం)లో ఆంధ్రప్రదేశ్ స్కిల్ డెవలప్‌మెంట్ అథారిటీ ద్వారా శిక్షణ పూర్తి చేసుకున్న విద్యార్థులకు సోమవారం గాలివీడు రోడ్డులోని టిడిపి కార్యాలయంలో రాష్ట్ర టిడిపి కార్యనిర్వాహక కార్యదర్శి సుగవాసి ప్రసాద్ బాబు సర్టిఫికెట్లు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ప్రసాద్ బాబు మాట్లాడుతూ కొంతకాలం నుంచి పట్టణంలో కంప్యూటర్‌లో ఉత్తమ బోధనతో శిక్షణ ఇస్తూ అనేకమందిని సాఫ్ట్‌వేర్ రంగంలోకి పంపిన ఘనత శివ సాయి టెక్నాలజీస్‌కే దక్కిందని కొనియాడారు. చాలా మంది విద్యార్థులు శివ సాయి టెక్నాలజీస్‌లో చేరి కంప్యూటర్‌లో ఉత్తమ శిక్షణ పొంది టెక్నాలజీ రంగంలో రాణిస్తూ ప్రస్తుత పోటీ రంగంలో దూసుకు పోతున్నారు అన్నారు. ఆంధ్రప్రదేశ్ నైపుణ్య అభివృద్ధి సంస్థ ద్వారా శివ సాయి టెక్నాలజీస్‌లో ఉచిత కంప్యూటర్ కోర్సులు నేర్చుకునే సదుపాయం ఉందని చెప్పారు. ఉచితంగా కంప్యూటర్ కోర్సులు నేర్చుకునే అవకాశం శివసాయి టెక్నాలజీస్ వారు కల్పిస్తున్నారని, విద్యార్థులు సద్వినియోగం చేసుకోవాలని పేర్కొన్నారు. అనంతరం సంస్థ మేనేజింగ్ డైరక్టర్ శివ సాయి కృష్ణ, డైరెక్టర్ మధు బాబు ను అభినందనలు తెలియజేశారు.



సర్టిఫికెట్లు పొందిన విద్యార్థులతో ప్రసాద్‌బాబు

బిటి కళాశాలను ప్రగతి పథంలో నడిపించండి : ఎమ్మెల్యే

ప్రజాశక్తి-మదనపల్లె అర్బన్

చారిత్రాత్మక బిటి ప్రభుత్వ డిగ్రీ కళాశాల ప్రిన్సిపల్‌గా కడప రీజనల్ జాయింట్ డైరెక్టర్ డాక్టర్ పి.బాబు సోమవారం బాధ్యతలు చేపట్టారు. వెంటనే ఆయన స్థానిక శాసనసభ్యులు షాజహాన్ బాషాని కలిసి కళాశాల అభివృద్ధికి చేపట్టవలసిన చర్యలు గురించి చర్చించారు. కళాశాల ప్రగతికి ఎల్లప్పుడూ తమ సహకారం ఉంటుందని హామీ ఇచ్చారు. అనంతరం డాక్టర్ పి.బాబు కళాశాలలోని ప్రతి డిపార్ట్మెంటును సందర్శించి సూచనలిచ్చారు. కళాశాలకు చెందిన అధ్యాపక అధ్యాపకేతర సిబ్బందితో సమావేశం నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ కళాశాలలో ఉన్న సమస్యలన్నింటినీ వెంటనే పరిష్కరిస్తామని, ఇకముందు ఇక్కడ ఎలాంటి సమస్యలు ఉండవని అందువలన విద్యార్థుల తల్లిదండ్రులు ఎలాంటి సందేహాలు పెట్టుకోకుండా తమ బిడ్డలను బీటీ కళాశాలలో చేర్పించి వారి బంగారు భవిష్యత్తుకు బాటలు వేసుకోవాలని పిలుపునిచ్చారు.

మదన్ మోహన్‌రెడ్డిని తక్షణమే అరెస్టు చేయాలి

ప్రజాశక్తి - రాయచోటి

రూరల్ పరిధిలో ఉన్న యండపల్లి పంచాయతీకి చెందిన పప్పిరెడ్డి మదన్‌మోహన్‌రెడ్డి పేదల భూములు కబ్జా చేసి దౌర్జన్యానికి పాల్పడుతున్నారని తక్షణమే ఎస్‌పి స్పందించి ఆయన్ను అరెస్టు చేయాలని ఎఐఎఫ్‌బి రాష్ట్ర కార్యదర్శి జె.జయవర్ధన్, ఆర్ఎస్‌పి రాష్ట్ర కన్వీనర్ కె.సుబ్బారాయుడు డిమాండ్ చేశారు. సోమవారం పట్టణంలోని ఎఐఎఫ్‌బి కార్యాలయంలో వారు మాట్లాడుతూ గతంలో వైసిపిలో ఉన్నప్పుడు ఇదే తరహా బెదిరింపులు పాల్పడ్డారని ప్రస్తుతం టిడిపిలో చేరి దౌర్జన్యానికి దిగుతున్నారని పేర్కొన్నారు. కోర్టుకు వెళ్లి భూములను కాపాడుకోవాలని ప్రయత్నించినా రాజకీయ పలుకుబడి, రెవెన్యూ అధికారులు తెలుసునని చెప్తున్నారు అన్నారు. యాస్మిన్, మనోహర్, ఈశ్వరయ్య నారాయణ, చలపతికి చెందిన భూములు అనేక ఎకరాలు కబ్జా చేశారని ఆరోపించారు. తక్షమే పోలీస్ అధికారులు స్పందించి పేద ప్రజలుకు న్యాయం చేయాలని కోరారు. కార్యక్రమంలో ఎఐఎఫ్‌బి, ఆర్ఎస్‌పి నాయకులు సుబ్రహ్మణ్యం, భాస్కర్, ఖాదర్ బాషా, సికిందర్, రామాంజనేయులు పాల్గొన్నారు.



సచివాలయాన్ని ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే షాజహాన్‌బాషా

ప్రజలకు పారదర్శకమైన సేవలందించాలి : ఎమ్మెల్యే

ప్రజాశక్తి-మదనపల్లె అర్బన్

సచివాలయ సిబ్బంది ప్రజలకు పారదర్శకమైన సేవలు అందించాలని ఎమ్మెల్యే షాజహాన్ బాషా ఆదేశించారు. సోమవారం స్థానిక కోళ్లబైలు పంచాయతీలో ఎన్‌టిఆర్ విలేజ్ హెల్త్ క్లినిక్, కోళ్లబైలు-2 సచివాలయాన్ని ఎమ్మెల్యే ప్రారంభించారు. స్థానిక టిడిపి నాయకులు రాటకొండ శ్రీనివాసులు నాయుడు ఆధ్వర్యంలో జరిగిన ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా ఎమ్మెల్యే హాజరుకాగా శ్రీనివాసులు నాయుడుతో పాటు బొమ్మిశెట్టి పురుషోత్తం, రెడ్డి రాయల్, మోహన్‌రెడ్డి ఆధ్వర్యంలో ఘనస్వాగతం పలికారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ గ్రామ సచివాలయం, విలేజ్ హెల్త్ క్లినిక్‌లు నిరంతరం ప్రజలకు అందుబాటులో ఉంటూ సేవలు అందించాలని ఆదేశించారు. అవినీతి రహితంగా, పారదర్శకంగా సేవలను అందిస్తూ ప్రజలకు మరింత దగ్గర కావాలన్నారు. గత ప్రభుత్వం సచివాలయాలను కేవలం ప్రభుత్వ భూములు కబ్జా చేయడం కోసం వాటి వివరాలు రాబట్టుకోవడానికి పరిమితమయ్యాయని ఆరోపించారు. ఇక్కడ అందుబాటులో ఉన్న సిబ్బంది మొత్తం కార్యాలయ ప్రాంగణం మొత్తం 150 మొక్కలు నాటి వాటిని సంరక్షించే బాధ్యత తీసుకోవాలని ఆదేశించారు. కార్యక్రమంలో గంగారపు రామ్మూర్తి నాయుడు, యర్రబల్లి వెంకటరమణారెడ్డి, నాగూర్‌వలి, తమ్మిశెట్టి రామకృష్ణ, చలపతి, కంచర్ల మల్లికార్జున నాయుడు, మధుసూదన్‌రెడ్డి, రమేష్, చంద్ర మోహన్, సురేష్, జి.వి.నాయుడు, పెంచుపాడు స్వామి, వేణు, శివాజీ రాయల్ పాల్గొన్నారు.

మహిళలు ఆర్థికంగా ఎదగాలి : జెసి

ప్రజాశక్తి - రాయచోటి

మహిళలు కుట్టుమిషన్ ద్వారా ఉపాధి పొంది తమకాలపై నిలబడి ఆర్థిక ఎదగాలని జాయింట్ కలెక్టర్ ఫర్మాన్ అహ్మద్‌ఖాన్ పేర్కొన్నారు. సోమవారం ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర నైపుణ్యాభివృద్ధి సంస్థ ఆధ్వర్యంలో వరల్డ్ యూత్ స్కిల్‌డే సందర్భంగా స్కిల్ హబ్‌లో టైలరింగ్‌లో శిక్షణ పొందిన 60 మంది నిరుద్యోగ మహిళలకు శిక్షణ సర్టిఫికెట్లను అందజేశారు. 25 మంది మహిళలకు కుట్టు మిషన్లు పంపిణీ చేశారు. కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన జెసి మాట్లాడుతూ ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం ఏర్పాటు చేసిన స్కిల్ హబ్స్‌లో శిక్షణ తీసుకొని యువత చిత్తశుద్ధితో కష్టపడి పని చేస్తే విజయవంతం వారి సొంతం అవుతుందని చెప్పారు. రాష్ట్ర ప్రభుత్వం యువత ఉద్యోగాలు పొందేలా చాలా పథకాలను ప్రవేశపెట్టిందన్నారు. అందులో భాగంగానే నైపుణ్య హబ్ లను ఏర్పాటు చేసిందని, జిల్లా యువత ఇటువంటి సౌకర్యాలను ఉపయోగించుకొని, ఉన్నత ఉద్యోగాలు పొందాలని పేర్కొన్నారు. విద్యార్థులు చిన్నప్పటి నుంచి క్రమశిక్షణ అలవరుచుకొని ఇష్టంతో కష్టపడి చదివి అన్ని రంగాలలో పట్టుసాధించాలన్నారు. నైపుణ్యత కలిగి ఉంటే ఉద్యోగం మనల్ని వెతుక్కుంటూ వస్తుందన్నారు. ఆ దిశగా నైపుణ్యం విషయంలోనూ యువతీ, యువకులు ముందుకు సాగాలన్నారు. మహిళలు వీటి ద్వారా ఉపాధి పొంది తమ కుటుంబానికి ఆసరాగా నిలబడాలని సూచించారు. కార్యక్రమంలో ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర నైపుణ్యాభివృద్ధి సంస్థ జిల్లా అధికారి హరికృష్ణ, జిల్లా జిఎస్ డబ్ల్యూఎస్ అధికారి లక్ష్మిపతి, ప్రాజెక్ట్ డైరెక్టర్ నాగేశ్వరరావు, అధికారులు పాల్గొన్నారు.



శిక్షణ పొందిన మహిళకు సర్టిఫికెట్ ఇస్తున్న జెసి ఫర్మాన్ అహ్మద్‌ఖాన్

'లేబర్ ఇన్సూరెన్స్'ను సద్వినియోగం చేసుకోండి

ప్రజాశక్తి-రామాపురం : కేంద్ర ప్రభుత్వం ప్రవేశపెట్టిన లేబర్ ఇన్సూరెన్స్ పథకాన్ని సద్వినియోగం చేసుకోవాలని లక్కిరెడ్డిపల్లి మార్కెట్ కమిటీ మాజీ ఛైర్మన్ మద్దిరేవుల రమేష్ రెడ్డి అన్నారు. మండల కేంద్రంలో సోమవారం ఆయన మాట్లాడుతూ ప్రభుత్వ ఉద్యోగుల తప్ప ఎలాంటి కూలీలైనా ఈ పథకానికి 18 నుండి 55 సంవత్సరాల లోపు వారు అందరూ అర్హులే అన్నారు. రూ.110 చెల్లిస్తే ఐదు సంవత్సరాల వరకు చెల్లించాలని పని లేదన్నారు. ఒక సంవత్సరం పాలసీ పొందిన తర్వాత పాలసీదారుడు ప్రమాదవశాత్తు 50 శాతం వికలాంగుడిగా మారితే 2.50 లక్షలు , 100శాతం వికలాంగుడైతే రూ. ఐదు లక్షలు పరిహారం పొందే అవకాశం ఉందన్నారు. పాలసీదారుడు సహజ మరణం పొందితే రూ. 1,30,000, ప్రమాదవశాత్తు మరణిస్తే రూ. 6 లక్షల బీమా వస్తుందన్నారు. వివరాలకు మండలంలోని ఎంపిడిఒ, తహశీల్దార్, లేబర్ ఆఫీసర్‌ను సంప్రదించాలన్నారు.

ట్రిపుల్‌ఐటికి మోడల్ స్కూల్ విద్యార్థి ఎంపిక

ప్రజాశక్తి-రామాపురం : 2024-25 విద్యా సంవత్సరానికిగాను ట్రిపుల్‌ఐటి కౌన్సెలింగ్‌లో రామాపురం మోడల్ స్కూల్ విద్యార్థి భవాని శంకర్ సీటు సాధించినట్లు ప్రిన్సిపల్ శ్యామలాదేవి ఒక ప్రకటనలో తెలిపారు. తమ పాఠశాలలో ఆరో తరగతి నుంచి పదో తరగతి వరకు చదివి 2024 మార్చిలో జరిగిన పదో తరగతి పరీక్షల్లో 576 మార్కులు సాధించిన భవాని శంకర్ ట్రిపుల్‌ఐటిలో సీటు సాధించడం సంతోషంగా ఉందన్నారు.

సమన్వయంతో ముందుకు సాగాలి : ఎమ్మెల్యే


ఎమ్మెల్యేకు స్వాగతం పలుకుతున్న మండి యజమానులు

ప్రజాశక్తి-మదనపల్లె అర్బన్

ఆసియా ఖండంలోనే టమోటాల ఎగుమతుల్లో అగ్ర స్థానంలో ఉన్న మదనపల్లె టమోటా మార్కెట్ యార్డులో కొనసాగుతున్న విధానాలపై రైతులు గళం విప్పారు. సోమవారం స్థానిక మార్కెట్ యార్డ్‌లో రైతులు, కమిషన్ ఎజెంట్లు, వ్యాపారస్తులతో ఎమ్మెల్యే సమావేశం నిర్వహించారు. ఈ సమావేశానికి ఎమ్మెల్యే షాజహాన్‌బాషా, మార్కెటింగ్ ఎడిఎం తుళ్లూరి త్యాగరాజు, మార్కెట్ కార్యదర్శి అబిలాష్ హాజరయ్యారు. ఈ సందర్భంగా పలువురు రైతులు మాట్లాడుతూ ముఖ్యంగా మార్కెట్‌లో పదిశాతం కమిషన్, జాక్ పాట్ విధానం, క్రేట్లకు బాడుగ, అన్ లోడింగ్ బాడుగతో పాటు గ్రేడింగ్ కూలీలు, క్రేట్స్ పైన ఎత్తులు పెట్టడం మొదలుకొని పాడిన వేలంపాట మొత్తంలోను బిల్లు వేసిన తరువాత కొంత మొత్తం కోత విధించే విధానాల వలన రైతులు నష్టపోవాల్సి వస్తోందని ఆవేదన వ్యక్తం చేశారు. వీటికి పరిష్కారం చూపాలని ఎమ్మెల్యే దృష్టికి తీసుకువచ్చారు. రైతులు ఈ అంశాలపైన కమీషన్ ఎజెంట్లను ప్రశ్నిస్తే ధరలు తగ్గించి నష్టం కలిగించడం కొనసాగుతూ వస్తోందని పేర్కొన్నారు. వీటిపై కమీషన్ ఎజెంట్లు స్పందిస్తూ రైతులు వారి సొంత క్రేట్లలో టమోటాలు తీసుకు వస్తే దానికి బాడుగ తీసుకోమని చెప్పారు. వేలం పాడే సమయంపైన, క్రేట్స్ ఒక దానిపై మరొక్కటి నాలుగు వరసలు పేర్చడంపైన వ్యాపారులు, రైతులు, కమీషన్ ఎజెంట్లు కలసి చర్చించి నిర్ణయం ప్రకటిస్తామని తెలిపారు. తరచుగా ట్రాఫిక్ జామ్ అవుతువుండటంపైన రైతులు, కమీషన్ ఏజెంట్లు సమన్వయంతో సమస్య లేకుండా చూసుకోవాలని ఎమ్మెల్యే స్పష్టం చేశారు. ఇది తిరిగి పునరావృతం కాకూడదని ఆదేశించారు. రైతులు రాత్రి సమయంలో నిద్రపోవడానికి ఏర్పాటు చేసిన రెస్ట్ హౌస్‌లో ఎసి ఏర్పాటు చేస్తామని పేర్కొన్నారు. యార్డులో నుండి బయటకు వాహనాలు వెళ్ళడానికి ప్రత్యామ్నాయ మార్గం ఏర్పాటుపైన పరిశీలిస్తామన్నారు. ముందుగా ఎమ్మెల్యేకి మండి యజమానులు పుష్పగుచ్ఛం అందజేసి, శాలువాతో ఘనంగా సత్కరించారు. సమావేశంలో మండి యజమానులు ముసలికుంట నాగయ్య, మస్తాన్, గౌస్, ఖాదర్ వల్లి, కెవిఆర్ ఇతర యజమానులు, రైతులు, మార్కెట్ యార్డ్ సిబ్బంది పాల్గొన్నారు.

ప్రజాగాయకుడు శివప్రసాద్‌కు సన్మానం

ప్రజాశక్తి-మదనపల్లె అర్బన్

కర్ణాటక జానపద అకాడమీ చైర్మన్‌గా నియమితులైన, ప్రజా గాయకుడు గొల్లహళ్లి శివప్రసాద్‌ను కళాభిషేకం పేరుతో భారతీయ అంబేడ్కర్ సేన (బాస్) ఘనంగా సన్మానించింది. స్థానికంగా ఉన్న ఓ ప్రయివేట్ ఫంక్షన్ హాల్‌లో బాస్ వ్యవస్థాపకుడు పిటిఎం శివప్రసాద్ అధ్యక్షతన జరిగిన ఈ కార్యక్రమానికి ఆంధ్రప్రదేశ్ తోపాటు కర్ణాటక, తెలంగాణ రాష్ట్రాలకు చెందిన ప్రజా కళాకారులు హాజరై, ఆట, పాటలతో గొల్లహళ్లి శివప్రసాద్‌కు కళాభిషేకం చేశారు. ఈ సందర్భంగా పిటిఎం శివప్రసాద్‌తో పాటు దళిత సంఘర్షణ సమితి (డిఎస్ఎస్) కర్ణాటక రాష్ట్ర అగ్రనేతలు ఎన్.వెంకటేష్, ఎన్.మునుస్వామి, ప్రజాకవి పోతబోలు రెడ్డెప్ప, ప్రముఖ గాయకుడు బురుజు లక్ష్మీనారాయణ, తెలుగు కోకిల భూదేవి, మోటివేషనల్ స్పీకర్ రామ్మూర్తి, ఎస్సీ, ఎస్టీ ఉద్యోగ సంఘ నాయకులు మునివెంకటప్ప, అంజనప్ప తదితరులు గొల్లహళ్లి శివప్రసాద్‌కు గజమాల వేసి, శాలువలతో ఘనంగా సత్కరించి, జ్ఞాపికను బహుకరించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ గొల్లహళ్లి శివప్రసాద్ నాలుగు దశాబ్దాలుగా దళిత సంఘర్షణ సమితి (డిఎస్ఎస్) సాంస్కృతిక సారధిగా, పాటై-ఆటై అవిశ్రాంతంగా ప్రజల కోసం గానం చేస్తున్నారని, గ్రామీణ జానపద కళలపై పరిశోధనలు చేస్తూ వాటి పునరుద్ధరణ కోసం ప్రణాళికలు రూపొందిస్తున్నారని చెప్పారు. ఆయన సేవలను గుర్తించి కర్ణాటక జానపద అకాడమీ చైర్మన్ బాధ్యతలు అప్పగించడం పట్ల కర్ణాటక ప్రభుత్వానికి వీరు కృతజ్ఞతలు తెలియజేశారు. జానపద కళల పునరుద్ధరణ కోసం శివప్రసాద్ శక్తి వంచన లేకుండా కృషి చేయాలని, కొత్త పంథాలో జానపద అకాడమీ సేవలను విస్తృతం చేసి, ప్రజా ఉద్యమాలకు అండగా నిలవాలని సూచించారు. జానపద అకాడమీ చైర్మన్ శివప్రసాద్ మాట్లాడుతూ మన ఆదిమ సంస్కృతిలో శ్రమ శక్తుల చమట చుక్కల నుండి ఉద్భవించిన అద్భుతమైన ఆవిష్కరణ ఆట-పాట అని చెప్పారు. జానపద ప్రజా కళల అభివృద్ధికి అలుపెరుగని కృషి చేస్తానని హామీ ఇచ్చారు. తనను ఘనంగా సత్కరించిన బాస్ ప్రతినిధులకు, కళాకారులకు ప్రత్యేక కృతజ్ఞతలు తెలియజేశారు. కార్యక్రమంలో బాస్ నాయకులు గణపతి, కె.వి.రమణ, రిటైర్డ్ ప్రొఫెసర్ డాక్టర్ సి.చంద్రయ్య, నీరుగట్టి రమణ, చాట్ల బయన్న, సొన్నికంటి రెడ్డెప్ప, పాలకుంట శ్రీనివాసులు, సద్దల శశిధర్, ముత్యాల మోహన్, తలారి కృష్ణ, యోగేంద్ర, ప్రముఖ కళాకారులు కె.వి.రత్నం, మునిరెడ్డి, మద్దెల మల్లికార్జున, గిరిజ, వేమనారాయణ, ఆనంద్ తదితరులతోపాటు బాస్ మరియు కర్ణాటక డిఎస్ఎస్ ప్రతినిధులు పెద్దసంఖ్యలో పాల్గొన్నారు.


శివప్రసాద్‌ను సన్మానిస్తున్న బాస్ కుటుంబ సభ్యులు

అర్జీల పరిష్కారంలో అశ్రద్ధ వద్దు : జెసి


అర్జీదారుల సమస్యలు పరిశీలిస్తున్న జెసి ఫర్మాన్ అహ్మద్‌ఖాన్

ప్రజాశక్తి-రాయచోటి

ప్రజా సమస్యల పరిష్కార వేదికలో స్వీకరించిన అర్జీల పరిష్కారంలో అశ్రద్ధ చూపరాదని జెసి ఫర్మాన్ అహ్మద్‌ఖాన్ అధికారులను ఆదేశించారు. సోమవారం కలెక్టరేట్‌లోని సమావేశ హాలులో ప్రజా సమస్యల పరిష్కార వేదిక కార్యక్రమం నిర్వహించారు. జెసి, డిఆర్ఒ సత్యనారాయణ ప్రజల నుంచి ఫిర్యాదులు స్వీకరించారు. ఈ సందర్భంగా జెసి మాట్లాడుతూ ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన కార్యక్రమంలో అందిన అర్జీలకు అత్యంత ప్రాధాన్యత ఇవ్వాలన్నారు. బియాండ్ ఎస్ఎల్ఎ పరిధిలోకి వెళ్లకుండా ప్రజలు అందజేసిన అర్జీలను నిర్ణీత కాల వ్యవధిలోపు నాణ్యతగా పరిష్కరించాలని పేర్కొన్నారు. అర్జీలపై క్షేత్ర స్థాయిలో క్షుణ్ణంగా పరిశీలించి పారదర్శకంగా విచారణ చేయాలన్నారు. పెండింగ్ దరఖాస్తులు, బియాండ్ ఎస్-ఎల్ఎ, రీఓపెనింగ్ లేకుండా అర్జీదారుడు సంతృప్తి చెందేలా అర్జీలను పరిష్కరించాలన్నారు. ప్రజల నుంచి అర్జీలను స్వీకరించారు.

కార్యకర్తలకు అండగా ఉంటా : ఎమ్మెల్యే

ప్రజాశక్తి-తంబళ్లపల్లి

వైసిపి అధికారంలోకి రాలేదని ఎవరూ అధైర్యపడొద్దని నియోజకవర్గంలో అందుబాటులోనే ఉంటానని ఎమ్మెల్యే ద్వారకనాథ్‌రెడ్డి అన్నారు. ఎన్నికల ఫలితాల తరువాత మొదటిసారిగా సోమవారం తంబళ్లపల్లెకు వచ్చారు. ప్రజాప్రతినిధులు, నాయకులు, కార్యకర్తలతో ఆయన నివాసంలో సమావేశమయ్యారు. మండలంలో సమస్యలు అడిగి తెలుసుకున్నారు. కక్షపూరిత రాజకీయాలు, నాయకులపై దాడులు వద్దని, ప్రజలకు మేలు చేస్తూ వారి మన్ననలు పొందాలని ప్రస్తుత ప్రభుత్వాన్ని కోరారు. కార్యక్రమంలో వైసిపి మండల కన్వీనర్ చౌడేశ్వర్, సర్పంచ్‌ల సంఘం అధ్యక్షుడు సుధాకర్‌రెడ్డి, ప్రజాప్రతినిధులు, నాయకులు నరేంద్రరెడ్డి, రామ్మూర్తి, కరీం, కోటిరెడ్డి, శివారెడ్డి, కరీముల్లా, యుగంధర్ రెడ్డి, చంద్రశేఖర్ రెడ్డి, బాబురెడ్డి పాల్గొన్నారు.

గృహ నిర్మాణ పనులు వేగవంతం చేయాలి

ప్రజాశక్తి-తంబళ్లపల్లి

మండలంలో ప్రభుత్వం మంజూరు చేసిన పక్కా గృహాల నిర్మాణ పనులు వేగవంతంగా పూర్తి చేసేందుకు చర్యలు చేపట్టాలని డిఎల్‌పిఒ నాగరాజు తెలిపారు. సోమవారం ఎంపిడిఒ కార్యాలయంలో పంచాయతీ కార్యదర్శులు, ఇంజినీరింగ్ అసిస్టెంట్‌తో సమావేశం నిర్వహించారు. ఇప్పటివరకు ఏఏ తేదీలలో ఉన్న గృహ నిర్మాణాలను గుర్తించి నివేదిక ఇవ్వాలన్నారు. అసంపూర్తిగా ఉన్న నిర్మాణపు పనులను త్వరగా పూర్తి చేసుకునే విధంగా లబ్ధిదారులను చైతన్య పరచాలన్నారు. జరిగిన పనులకు వెంటనే బిల్లులు పెట్టాలని సూచించారు. ఎక్కడైనా విమర్శలు వచ్చినా అవకతవకలకు పాల్పడినట్లు ఫిర్యాదులు వచ్చిన చర్యలు తప్పవని హెచ్చరించారు. సమావేశంలో ఎంపిడిఒ కృష్ణ మూర్తి, ఇఒపిఆర్‌డి దిలీప్ కుమార్, ఎపిఎం గంగాధర్, ఎపిఒ అంజనప్ప పాల్గొన్నారు.

పరిసరాల శుభ్రతతోనే సంపూర్ణ ఆరోగ్యం

ప్రజాశక్తి-పీలేరు

వ్యక్తిగత, పరిసరాల పరిశుభ్రతతోనే ఆరోగ్యకర జీవనం సాధ్యమని తలుపుల ప్రాథమిక ఆరోగ్య కేంద్రం హెల్త్ ఎడ్యుకేటర్ కొండయ్య తెలిపారు. సోమవారం పీలేరు పట్టణ మహిళా సమాఖ్య భవనంలో జరిగిన సమావేశంలో విఒ లీడర్లకు "అధిక వర్షాలు-ఆరోగ్య నియమాలు" అనే అంశంపై అవగాహన కార్యక్రమం, ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పరిశుభ్రమైన గాలి, నీరు, ఆహారం, పరిసరాలు, మన ఆరోగ్యకర జీవనానికి ఎంతో అవసరమన్నారు. ఆరోగ్యకర నియమాలు, నిబంధనలను పాటించకుంటే నీళ్ల విరేచనాలు, టైఫాయిడ్, పచ్చకామెర్లు, జిగట విరేచనాలు, పోలియో, మొదలగు అంటువ్యాదులు సోకే ప్రమాదం వుందని హెచ్చరించారు. నీటిని కాచి, వడగట్టి చల్లార్చి లేదా శాస్త్రీయ పద్ధతిలో క్లోరినేషన్ విధానంలో శుద్ధి చేసిన నీటిని త్రాగడానికి వినియోగించాలని, తాజా ఆహారాన్ని ఫోన్ చేయాలని, ఈగలు ముసిరిన ఆహార పదార్థాలకు స్వస్తి చెప్పాలని, భోజనానికి ముందు ప్రతిసారీ రెండు చేతులు సబ్బుతో రుద్ది శుభ్రం చేసుకోవాలని, పరిసరాలు, వ్యక్తిగత శుభ్రత విధిగా పాటించాలని ఆయన సూచించారు. కార్యక్రమంలో వెలుగు ఎపిఒ లక్ష్మణరెడ్డి, ఎఎన్ఎం విజయకుమారి, సిహెచ్ఒ అయేషా, ఆశ కార్యకర్తలు విఒ లీడర్లు పాల్గొన్నారు.

పారిశుధ్య పనులు ముమ్మరం

ప్రజాశక్తి- కలకడ

మండల కేంద్రమైన కలగడలో పారిశుధ్యం పనులను ముమ్మరం చేసినట్లు పంచాయతీ కార్యదర్శి దేవేంద్ర తెలిపారు. ఇఒపిఆర్‌డి లతీఫ్‌ఖాన్ ఆధ్వర్యంలో మండల కేంద్రమైన కలకడలో పారిశుధ్యం పనులను చేపట్టారు. రాజావీధి, రాజీవ్ నగర్ విధులలో ఉన్న మురికి కాలువలలో చెత్తాచెదారంతో, మురికి నీటితో నిండి ఉండడం గుర్తించిన పంచాయతీ కార్యదర్శి పంచాయతీ సిబ్బందిచే పారిశుధ్యం పనులు మమరం చేసి కాలువలను శుభ్రం చేయించినట్లు తెలిపారు. మండల కేంద్రంలోని కలకడ, బాలయ్యగారిపల్లి పంచాయతీలలో మురికినీటి కాలువలను శుభ్రం చేయించి, ప్రజలు రోగాలు బారిన పడకుండా చూస్తామన్నారు. కార్యక్రమంలో పంచాయతీ సిబ్బంది పాల్గొన్నారు.

17న సాయి డిగ్రీ కళాశాలలో జాబ్‌మేళా

ప్రజాశక్తి-రైల్వేకోడూరు

పట్టణంలోని శ్రీ సాయి డిగ్రీ కళాశాలలో ఈ నెల 17వ తేదీన ఉద్యోగమేళా నిర్వహిస్తున్నట్లు ప్రిన్సిపల్ ముత్యాల పెంచలయ్య తెలిపారు. సోమవారం ఆయన మాట్లాడుతూ బహుళ జాతీయ సంస్థ అయిన 24/7 ఎఐ ఉద్యోగాలు భర్తీ చేసేందుకు మ్యాజిక్ బస్సు ఇండియా ఫౌండేషన్ వారి ఆధ్వర్యంలో ఉద్యోగమేల నిర్వహిస్తున్నట్లు తెలిపారు. అర్హులైన అభ్యర్థులు ఈ అవకాశాన్ని వినియోగించుకోవాలని కోరారు.

మెలకువలు పాటిస్తే అధిక లాభాలు : ఎఒ

ప్రజాశక్తి-మదనపల్లె

మదనపల్లి మండలంలోని వేంపల్లి, చీకలబైలు రైతుసేవా కేంద్రాల పరిధిలో మదనపల్లి వ్యవసాయ అధికారి నాగ ప్రసాద్, ఉద్యాన అధికారి ఈశ్వర్ ప్రసాద్‌రెడ్డి సోమవారం సంయుక్తంగా పర్యటించి రైతులకు ఖరీఫ్‌లో వేరుశనగ, టమోటా తదితర పంటల్లో మండల సాగులో చేపట్టవలసిన జాగ్రత్తలు గురించి అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ విత్తనశుద్ధి చేసిన తర్వాతే పంటలు విత్తుకోవాలని, రైతులు తమ పొలాల్లో మట్టి పరీక్షలు చేయించుకుని అందులో వచ్చిన ఫలితాల ప్రకారం ఎరువులు వాడకాన్ని చేపట్టాలని పేర్కొన్నారు. జీవన ఎరువులు వాడకం చేపట్టాలని వ్యవసాయ అధికారి తెలిపారు. సూక్ష్మ నీటిపారుదల, టమోటా సాగు, పళ్ల తోటల్లో తీసుకోవలసిన చర్యలు గురించి ఉద్యాన అధికారి రైతులతో సమావేశంలో చర్చించి తదుపరి పంటలను పరిశీలించారు. కార్యక్రమంలో రైతులు, వేంపల్లి ఉద్యాన సహాయకులు కుసుమ, చీకిలబైలు వ్యవసాయ సహాయకులు తేజ పాల్గొన్నారు.

జిపిఎస్ ఆమోదయోగ్యం కాదు

ప్రజాశక్తి కలికిరి

గత ప్రభుత్వం ప్రవేశపెట్టిన జిపిఎస్ ఆమోదయోగ్యం కాదని ఎపిటిఎఫ్ జిల్లా నాయకులు కుమార్ యాదవ్ అన్నారు. సోమవారం ఆయన మాట్లాడుతూ గత ప్రభుత్వం సిపిఎస్ వారంలో రద్దు చేసి ఓపిస్ విధానం తీసుకొస్తామని పదేపదే హామీ ఇచ్చి మాటతప్పి జిపిఎస్ తీసుకొచ్చి మోసం చేసిందని, ఇపుడు కూటమి ప్రభుత్వం గత ప్రభుత్వం రూపొందించిన ఫైలుపై గతనెల 12న నాటి ఆర్థిక శాఖ కార్యదర్శి రావత్ సంతకంచేసి ఇచ్చిన జిఒ నంబరు 54 ను తాజాగా గెజిట్ లో చేర్చడం సమంజసం కాదని తప్పుపట్టారు. ఉద్యోగులకు నష్టంచేసే గత ప్రభుత్వ విధానాన్ని కూటమి ప్రభుత్వం అమలు చేయొద్దని కోరారు. నేటి ప్రభుత్వం ఎన్నికల ముందు హామీ ఇచ్చినట్టు ఉద్యోగులకు అధ్యయనం చేసి పాతపెన్షన్ స్కీమ్ ప్రయోజనాలను పునరుద్ధరించే విధానాన్ని రూపొందించి మేలు చేకూరుస్తామన్న హామీని నిలబెట్టుకంటారని ఆశాభావం వ్యక్తం చేశారు.




శిక్షణ పొందిన మహిళకు సర్టిఫికెట్ అందజేస్తున్న సిపిఒ సుదర్శన్‌రెడ్డి

ప్రతిభను గుర్తించి శిక్షణ ఇవ్వడమే లక్ష్యం

- ఎపిఎండిసి సిపిఒ సుదర్శన్‌రెడ్డి

ప్రజాశక్తి-రైల్వేకోడూరు

యువతలోని ప్రతిభను గుర్తించి అవసరమైన శిక్షణ అందించడమే లక్ష్యంగా రాష్ట్ర ప్రభుత్వం పని చేస్తుందని ఎపిఎండిసి సిపిఒ సుదర్శన్‌రెడ్డి అన్నారు. గ్లోబల్ సర్వీస్ ట్రస్ట్ ఆధ్వర్యంలో ఘనంగా ప్రపంచ యువ నైపుణ్య దినోత్సవం స్థానిక డాక్టర్ గిరిజమ్మ వీధిలోని గ్లోబల్ స్కిల్ ట్రైనింగ్ సెంటర్‌లో ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర నైపుణ్యాభివృద్ధి సంస్థ ఆదేశాల మేరకు గ్లోబల్ సర్వీస్ ట్రస్ట్ ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు. కార్యక్రమానికి ముఖ్య అతిధిగా విచ్చేసిన ఆయన మాట్లాడుతూ ఇటువంటి శిక్షణా కార్యక్రమాలను యువత ఉపయోగించుకోవాలన్నారు. ఎపిఎండిసి ఫౌండేషన్ సిఎస్ఆర్ ప్రాజెక్ట్ ఆఫీసర్ సుబ్రమణ్యం మాట్లాడుతూ ఫౌండేషన్ ద్వారా టైలరింగ్ శిక్షణ పొందిన వారికి ఉచితంగా కుట్టు మెషీన్లు అందజేసామన్నారు. ట్రస్ట్ చైర్మన్ కె.పార్థసారధి మాట్లాడుతూ మహిళలకు టైలరింగ్, మగ్గం వర్క్, యువతకు కంప్యూటర్ కోర్సుల్లో ఉచితంగా శిక్షణ ఇచ్చామని ప్రతి గ్రామంలో యువతకు మహిళలకు ఉపయోగపడే శిక్షణా కార్యక్రమాలను చేపడుతామని తెలిపారు. అనంతరం రైల్వేకోడూరు, మంగంపేటలో టైలరింగ్ మగ్గం వర్క్ శిక్షణ పొందిన మహిళలకు సర్టిఫికెట్స్ అందజేశారు. కార్యక్రమంలో ట్రైనర్లు పాలెంకోట పద్మావతి, హారిక, పవిత్ర, గంగాదేవి, మహిళలు పాల్గొన్నారు.


మాట్లాడుతున్న హుమాయూన్, సోదరులు

వైసిపికి హుమయూన్, సోదరులు రాజీనామా

ప్రజాశక్తి-పీలేరు : వైసిపి క్రియాశీల సభ్యత్వానికి పీలేరు మాజీ సర్పంచ్ ఎఎస్.హుమయూన్, సోదరులు రాజీనామా చేశారు. హుమయూన్ వైసిపి రాష్ట్ర కార్యదర్శి పదవికి, సోదరుడు షాజహాన్ మండల పార్టీ ఉపాధ్యక్ష పదవికి, పార్టీ సభ్యత్వాలకు కూడా రాజీనామాలు సమర్పించారు. అతని మిగిలిన ఇతర సోదరులైన సలీం, జహంగీర్ కూడా పార్టీకి రాజీనామా చేసినట్లు ప్రకటించారు. సోమవారం స్థానిక షుకూర్ ప్యాలెస్‌లో జరిగిన విలేకరుల సమావేశంలో వారు మాట్లాడుతూ తమ కుటుంబ సభ్యులు, మిత్రులు, హితులు, సన్నితులు, శ్రేయోభిలాషుల సూచనలు, సలహాల మేరకు తాము ఈ నిర్ణయాన్ని తీసుకున్నట్లు చెప్పారు. మాజీ సర్పంచ్ హుమాయూన్ మాట్లాడుతూ 1960 నుంచి తమ కుటుంబం ప్రత్యక్ష రాజకీయాల్లో ఉందన్నారు. తన తండ్రి షుకూర్ సాహెబ్ మూడుసార్లు, తాను రెండుసార్లు పీలేరు మేజర్ గ్రామ పంచాయతీకి సర్పంచ్‌లుగా ఎన్నికై పంచాయతీ అభివృద్ధికి పాటు పడ్డంతో పాటు పట్టణ ప్రజలకు ఎన్నో సేవలు అందించి, నేటికీ పట్టణ ప్రజలకు తల్లో నాలుకలా తాము, తమ కుటుంబం వ్యవహరిస్తోందని పేర్కొన్నారు. ఇదే ఒరవడిని ఇక ముందు కూడా కొనసాగిస్తూ స్థానిక ప్రజలకు అందుబాటులో ఉంటామని వారు స్పష్టం చేశారు. తమ రాజీనామా పత్రాలను వైసిపి రాష్ట్ర ప్రధాన కార్యాలయానికి పంపినట్లు తెలియజేశారు. సమావేశంలో హుమాయూన్ సోదరులు సలీం, షాజహాన్, జహంగీర్, ఇతర కుటుంబ సభ్యులు పాల్గొన్నారు.


చందన అలంకారంలో లక్ష్మీ నృసింహస్వామి

ప్రజాశక్తి-రాజంపేట అర్బన్ : స్వామి వారి జన్మ నక్షత్రమైన స్వాతి నక్షత్రం సందర్భంగా సోమవారం శ్రీ భువనగిరి లక్ష్మీ నృసింహస్వామి చందన అలంకారంలో అత్యంత వైభవంగా దర్శనమిచ్చారు. భక్తాదులు పెద్ద ఎత్తున పాల్గొని స్వామి వారి దర్శనం చేసుకుని భక్తి పారవశ్యంలో మునిగిపోయారు.

గురువుల సేవలు మరువలేనివి

ప్రజాశక్తి-పీలేరు

పీలేరు మండలంలో సుధీర్ఘకాలం ఉపాధ్యాయులు, ప్రధానోపాధ్యాయులుగా విశేష సేవలందించిన గురువుల వీడ్కోలు, స్వాగత కార్యక్రమం ఘనంగా నిర్వహించారు. సోమవారం స్థానిక మండల వనరుల కేంద్రంలో జరిగిన ఈ కార్యక్రమంలో ముగ్గురు ప్రధానోపాధ్యాయులకు, ఇద్దరు ఎంఇఒలకు ఘన సన్మానం లభించింది. జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల ముడుపులవేములలో పనిచేసి బదిలీపై నరసింగాపురం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలకు బదిలీపై వెళ్లిన రామమూర్తి, పీలేరు జిల్లా పరిషత్ బాలికల ఉన్నత పాఠశాలలో పనిచేసి ప్రస్తుతం కలికిరి బాలికల ఉన్నత పాఠశాలకు బదిలీపై వెళ్లిన ఎన్.జయమ్మ, ఒంటిల్లు జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో పనిచేసి, ప్రస్తుతం గ్యారంపల్లి జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలకు బదిలీపై వెళ్లిన శ్రీహరి, అనంతపురం జిల్లా నుంచి బదిలీపై పీలేరు మండల విద్యాశాఖ అధికారి -1 గా పదవీ బాధ్యతలు చేపట్టిన వై.లోకేశ్వర్‌రెడ్డి, కోటపల్లి జెడ్పీ బాలిక ఉన్నత పాఠశాల ప్రధానోపాధ్యాయినిగా పనిచేస్తూ ఎంఇఒ-2గా పదవీ బాధ్యతలు చేపట్టిన బి.పద్మావతిలకు వీడ్కోలు, స్వాగత జరిగింది. వీరి సేవలను పలువురు ప్రధానోపాధ్యాయులు కొనియాడారు. కార్యక్రమంలో పీలేరు మండలంలోని 15 ప్రభుత్వ ఉన్నత పాఠశాలల ప్రధానోపాధ్యాయులు వి.జి.నటరాజ, వేణుగోపాల్ రెడ్డి, రెడ్డిబాబు రెడ్డి, సురేంద్ర నాథ్ రెడ్డి, సురేంద్ర, శోభారాణి, పౌజియ బేగం, రెడ్డప్ప, గంగాధర, శివశంకరయ్య, నాగరత్నమ్మ, సావిత్రి, పార్వతి, సత్యనారాయణ, ఝాన్సీ లక్ష్మీబాయి, సిఆర్‌పిలు పాల్గొన్నారు.


గురువులను సన్మానిస్తున్న ఉపాధ్యాయులు


బిటి కళాశాలలో జీతం లేకుండా పనిచేస్తున్న బోధనేతర సిబ్బంది

బిటి కళాశాల బోధనేతర సిబ్బందికి ఆర్థిక సాయం

ప్రజాశక్తి-మదనపల్లె అర్బన్

మదనపల్లె బిటి కళాశాలలో పనిచేస్తున్న బోధనేతర సిబ్బందికి వెల్ విషర్స్ సభ్యుడు ఆర్థిక సాయం అందించాడు. కృష్ణప్ప, కమలమ్మ, నాగరాజ, అరుణ, లక్ష్మినారాయణ, శకుంతల స్థానిక బిటి కళాశాలలో 2012 నుంచి బోధనేతర సిబ్బందిగా పనిచేస్తున్నారు. 2019 నుంచి జీతభత్యాలు లేకపోయినా కాలేజీనే నమ్ముకుని పని చేస్తున్నారు. ఇటీవల వీరితో పాటు పనిచేసే మరికొంత మంది బోధనేతర సిబ్బంది మాజీ కరస్పాండెంట్ ద్వారా మంత్రి లోకేష్‌ను కలిసి సమస్యను పరిష్కరించుకున్నారు. ఉద్దేశ పూర్వకంగా ఆ మాజీ కరస్పాండెంట్ ఆరుగురి పేర్లు లిస్ట్ లేకుండా తొలగించి మోసం చేశాడు. వీరి పరిస్థితి దుర్భరంగా మారింది. సమస్యను తెలుసుకున్న వెల్ విషర్స్ సభ్యుడు దేవరాజ కిరణ్ లండన్‌లో ఉన్న స్నేహితుడు బెజవాడ బాలాజి దృష్టికి తీసుకెళ్లాడు. స్పందించిన అతను ఆరుగురు మంత్రి లోకేష్‌ను కలిసేందుకు తనవంతుగా రూ.ఆరు వేలు పంపించాడు. మరింత మంది వీరికి సాయం చేసి ఆదుకోవాలని వెల్ విషర్స్ నిర్వాహకులు గిరీష్ కోరుతున్నారు.

పౌష్టికాహారంతోనే ఆరోగ్యం : డాక్టర్

ప్రజాశక్తి-తంబళ్లపల్లి : గర్భిణులు పౌష్టిక ఆహారం తీసుకున్నప్పుడే తల్లి బిడ్డకు ఆరోగ్యం చేకూరుతుందని గైనకాలజిస్ట్ తేజశ్రీ తెలిపారు. సోమవారం ప్రభుత్వ వైద్య విధాన పరిషత్ ఆసుపత్రిలో గర్భిణులకు పరీక్షలు నిర్వహించి ఆరోగ్య సూచనలు ఇచ్చారు. గర్భందాల్చిన వెంటనే ఆశా కార్యకర్తలు దృష్టికి తీసుకెళ్లి ప్రభుత్వాసుపత్రులలో క్రమం తప్పకుండా పరీక్షలు చేయించు కోవాలన్నారు. వైద్యుల సలహా మేరకు ఆరోగ్యాన్ని సంరక్షించుకోవాలన్నారు. గర్భిణులు పండ్లు, గుడ్డుతో పాటు ఆకుకూరలు ఎక్కువగా తీసుకోవాలన్నారు. అప్పుడే రక్తహీనత దూరమై సుఖప్రసవం జరుగుతుందన్నారు. ప్రతి నెలా ఆసుపత్రిలో పరీక్షలు చేయించుకోవాలన్నారు.

రోడ్డుపై మురునీరు - ఇబ్బందుల్లో ప్రజలు

ప్రజాశక్తి-గాలివీడు

స్థానిక బస్టాండ్ నుంచి పెద్దూరు వరకు మురునీరు రోడ్డపై ప్రవహిస్తోంది. ప్రజలు, వాహనదారులు, ప్రయాణికులు ఇబ్బందులు పడుతున్నారు. ఖాజామియా టీ హోటల్ వద్ద నుంచి మురుగు కాలువ నీరు పొంగి ప్రవహిస్తుంది. నీరు బస్టాండ్ మీదుగా పెద్దూరు వరకు మురుగు నీరు ప్రధాన రహదారిపై ప్రవహిస్తుంది. గేటు నుంచి కుశావతి నది వరకు ప్రధాన కాలువ రోడ్డు కిరువైపులా ఉంది. పెద్దూరుకు పోయే దారి వద్ద కూడా ఉన్న తూము తగ్గులో ఉండడంతో నీరు వెళ్లే దారి లేక మధ్యలోనే స్తంభించిపోయే పరిస్థితులు ఏర్పడ్డాయి. ఇప్పటికైనా పంచాయతీ అధికారులు స్పందించి కాల్వలో పేరుకుపోయిన చెత్తను తొలగించి నీరు సాఫీగా వెళ్లేలా చర్యలు తీసుకోవాలని స్థానికులు కోరుతున్నారు.


రోడ్డుపై పొంగి ప్రవహిస్తున్న మురుగు నీరు

క్రైం కార్నర్

జిల్లా సరిహద్దులో ఘోర రోడ్డుప్రమాదం

- ఇద్దరు యువకులు దుర్మరణం

ప్రజాశక్తి-మదనపల్లె అర్బన్

మదనపల్లె-బెంగళూరు జాతీయ రహదారి, చీకిలబైలు చెక్ పోస్ట్ సరిహద్దు వద్ద సోమవారం సాయంత్రం ఘోర రోడ్డు ప్రమాదం చోటు చేసుకుంది. ఈ ప్రమాదంలో ఇద్దరు యువకులు సంఘటనా స్థలంలోనే దుర్మరణం చెందారు. తాలూక పోలీసులు తెలిపిన వివరాల మేరకు.. అన్నమయ్య జిల్లా, తంబళ్లపల్లి నియోజకవర్గం, పెద్దమండ్యం మండలం, కలిచెర్ల గ్రామ పంచాయతీ బాటవారిపల్లికి చెందిన ఎర్రగోల్ల వెంకటరమణ, శివమ్మ దంపతుల కుమారుడు మోహన్(23), అదే ఊరికి చెందిన ఎర్రగోల్ల రెడ్డప్ప కుమారుడు సాయికుమార్ (22) స్వగ్రామం నుంచి బెంగళూరుకు ద్విచక్ర వాహనంలో బయలుదేరారు. మార్గమధ్యంలోని చీకలబైలు చెక్ పోస్ట్ వద్ద మదనపల్లె వైపు వెళ్తున్న బస్సు ఢీకొంది. ఈ ప్రమాదంలో యువకులిద్దరూ అక్కడికక్కడే మృతి చెందారు. విషయం తెలుసుకున్న మదనపల్లె తాలూకా సిఐ శేఖర్, ఎస్ఐ రవికుమార్, పోలీస్ సిబ్బంది సంఘటనా స్థలానికి చేరుకొని పరిస్థితిని సమీక్షించారు. స్థంభించిన ట్రాఫిక్‌ను పునరుద్ధరించారు. యువకుల వద్ద దొరికిన ఆధార్ కార్డు ద్వారా కుటుంబ సభ్యులకు సమాచారం అందించారు. అనంతరం మృతదేహాలను మదనపల్లె సర్వజన బోధనాస్పత్రి మార్చురీకి తరలించారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు సిఐ తెలిపారు.


మృతి చెందిన మోహన్ (ఫైల్ ఫొటో)


మృతి చెందిన సాయికుమార్ (ఫైల్ ఫొటో)

రోడ్డు ప్రమాదంలో వ్యక్తి మృతి

ప్రజాశక్తి-రామాపురం

కర్నూలు-చిత్తూరు 40వ జాతీయ రహదారిలోని రామాపురం మండలం చిట్లురు పంచాయతీ పాలన్నగారిపల్లి వద్ద ఆదివారం రాత్రి నిలబడి ఉన్న వ్యక్తిని స్కూటర్, సుమో ఢీకొనడంతో అక్కడికక్కడే మృతిచెందాడు. పోలీసుల కథనం మేరకు.. మండలంలోని చిట్లూరు పంచాయతీ పాలన్నగారిపల్లికి చెందిన నాగ భాస్కర్ (45) అనే వ్యక్తి రోడ్డుపై నిలబడి ఉండగా కడప వైపు నుంచి రాయచోటి వైపు వెళ్తున్న స్కూటర్ ఢీకొని రోడ్డుపై పడ్డాడు. అదే సమయంలో స్కూట్ వెనుక వైపు వస్తున్న సుమో కూడా అతనిపై నుంచి వెళ్లడంతో అక్కడికక్కడే దుర్మరణం చెందాడు. రామాపురం పోలీసులు సంఘటన స్థలానికి చేరుకొని మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం రాయచోటి ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. ఈ మేరకు కేసు నమోదు చేసినట్లు దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ వి.ఎల్ ప్రసాద్ రెడ్డి తెలిపారు.

ప్రమాదంలో గాయపడ్డ విద్యార్థి..

ప్రజాశక్తి-మదనపల్లె అర్బన్

రోడ్డు ప్రమాదంలో గాయపడ్డ విద్యార్థి మృతి చెందినట్లు తాలూకా ఎస్సై రవికుమార్ తెలిపారు. మదనపల్లె బసినికొండలో ఆదివారం రాత్రి కారుఢీకొని చౌడేపల్లికి చెందిన ఆదర్శసాయి(21), అతని స్నేహితుడు గురప్ప (21)లు ఆదివారం రాత్రి ద్విచక్ర వాహనంలో మదనపల్లె నుండి చౌడేపల్లికి వెళుతుండగా నిమ్మనపల్లె రోడ్డు సర్కిల్లో కారు ఢీకొంది. ఈ ప్రమాదం లో ఇద్దరు కోమాలోకి వెళ్లారు. వారికి మదనపల్లె సర్వజన బోధనాస్పత్రిలో చికిత్స చేయించి రుయాకు తరలించారు. అక్కడ విద్యార్థి ఆదర్శసాయి మృతి చెందడంతో మదనపల్లె ప్రభుత్వాస్పత్రి మార్చురీకి తరలించారు. కుమారుడి మృతితో తల్లిదండ్రులు, కుటుంబ సభ్యులు కన్నీరు మున్నీరయ్యారు. కేసు దర్యాప్తులో ఉన్నట్లు ఎస్ఐ తెలిపారు.